క్లుప్తంగా

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండలంలోని దర్మంపూరి, గోండుగూడలో ఆదివారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది శేఖర్, దేవ్‌రాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డాక్టరేట్ పొందిన ప్రభాకర్‌కు సన్మానం

ఉట్నూర్‌రూరల్: ఇటీవల డాక్టరేట్ పొందిన దాసండ్ల ప్రభాకర్‌ను మండలంలోని దంతన్‌పల్లి జామ మస్జిద్ కమిటీ యువకులు ఆదివారం సన్మానించారు. సామాజిక సేవ చేస్తూ.. ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉంటూ.. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకెళ్తున్న ప్రభాకర్‌కు డాక్టరేట్ రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం, ముజీబ్, సత్తార్, మునీర్, సులేమాన్, శంషొద్దీన్, యూసూఫ్, శారీక్, సురేశ్, సాగర్, మోయిన్ పాల్గొన్నారు.

'ఆత్రం సక్కును ఎంపీగా గెలిపించాలి'


మాట్లాడుతున్న పూర్ణచందర్‌నాయక్

ఇంద్రవెల్లి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పూర్ణ చందర్‌నాయక్ కోరారు. ఆదివారం మండలంలోని కోయల్‌పాండ్రి, మల్కుగూడ గ్రామాల్లో పర్యటించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ.. కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తున్న తీరును ఎండగట్టి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పుర్క చిత్రు, భీంరావ్, తదితరులు, పాల్గొన్నారు.

శత చండీయాగం పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని దుర్గనగర్‌లోని శ్రీ నవశక్తి దుర్గామాత ఆలయంలో ఏప్రిల్ 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు 108 హోమ కుండలతో నిర్వహించనున్న శత చండీయాగం పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్ మహరాజ్ మాట్లాడుతూ.. శత చండీయాగం సందర్భంగా లక్ష కుంకుమార్చన, పుష్పార్చన, దీపార్చనతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని యూనివర్సల్ కంప్యూటర్ కేంద్రం వద్ద మిర్జ జీలానిబేగ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ ప్రారంభించారు. మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి పటేల్ మారుతి డోంగ్రె, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ'కు ఎంపిక

ఇచ్చోడ: బోథ్ మండల కేంద్రానికి చెందిన బైరిస హస్ర నవోదయ పాఠశాలకు ఎంపికైంది. స్థానిక నాగభూషణం హైస్కూల్ ఐదో తరగతి చదువుతున్న సహస్ర ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, నవోదయకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు సహస్రను అభినందించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని 46 మంది గర్భిణులకు వైద్యాధికారి కౌస్తూభా స్కానింగ్ పరీక్షలు చేశారు. తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఈవో జ్ఞానేశ్వర్, స్టాఫ్‌నర్స్, ప్రవీణ, సిబ్బంది సాహితి, మయావతి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి కంకర తరలింపు

తాంసి: మండలంలోని వివిధ స్టోన్ క్రషర్ల నుంచి పరిమితికి మించి కంకరను తరలిస్తున్నారు. జిల్లా కేంద్రంతో వివిధ గ్రామాలకు అంతర్రాష్ట్ర రహదారి గుండా తరలించడంతో కంకర రాళ్లు రోడ్డుపై పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. రవాణాశాఖ అధికారులు స్పందించి పరిమితికి మించి కంకర తరలిస్తున్న టిప్పర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కూలర్లకు భలే డిమాండ్


విక్రయానికి సిద్ధంగా ఉన్న కూలర్లు


రిపేరుకు వచ్చిన కూలర్లు


కూలర్లు రిపేర్ చేస్తున్న మెకానిక్

- పెరుగుతున్న ఎండలతో కూలర్ల కొనుగోళ్లకు ఆసక్తి
- పాత కూలర్లకు మరమ్మతులు

కెరమెరి: జిల్లాలో ఎండలు తన ప్రతాపం చూపుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతుంటే రానున్న కాలంలో ఎలా ఉంటుందో ప్రజలు అర్థం చేసుకోవచ్చు. ఉక్కబోతకు ఉపశమనం కోసం ప్రజలు అనేక మార్గాలు వెతుక్కుంటున్నారు. ఇళ్లలో ఉక్కపోత పెరుగుతుండడంతో ఫ్యాన్లు, కూలర్ల విక్రయాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం కూలర్లకు డిమాండ్ బాగా పెరిగింది.

సరికొత్త డిజైన్లలో..

ప్రజల అభిరుచులకు అనుగుణంగా మార్కెట్‌లోకి సరికొత్త డిజైన్‌లలో ఫ్యాన్లు, కూలర్లు వచ్చాయి. అన్ని వర్గాలకు అనుగుణంగా ప్రజలకు అందుబాటు ధరల్లోనే కంపెనీలు అందిస్తున్నాయి. కంపెనీల మధ్య పోటీ ఉండడంతో సామాన్యులు కొనుగోలు చేసే ధరలకు ఫ్యాన్లు, కూలర్లు లభిస్తున్నాయి. నాణ్యతను బట్టి ధరలు ఉన్నాయి. బ్రాండెడ్ కూలర్లు రూ.7 వేల నుంచి రూ.12 వేల వరకు, లోకల్ బ్రాండ్ రూ.1800 -రూ.5వేల వరకు లభిస్తున్నాయి.

మరమ్మతులు..

కెరమెరి మండలంలో 31 గ్రామపంచాయతీలు, 156 గ్రామాలు ఉన్నాయి. 33 వేల జనాభా ఉంది. ప్రస్తుతం ప్రతీ ఇంటికి ఫ్యాన్, కూలర్ అవసరముంది. దీంతో ఇళ్లలోని పాత కూలర్లకు మరమ్మతులు చేయిస్తున్నారు. దీంతో ప్రతీరోజు రిపేరు కోసం పెద్ద సంఖ్యలో కూలర్లు రిపేర్ షాపుల వద్ద కన్పిస్తున్నాయి.

డిమాండ్ బాగా పెరిగింది



వేసవి ప్రారంభంతో కూలర్లకు డిమాండ్ పెరిగింది. ఫ్యాన్లు, కూలర్ల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. పేదలు, సామాన్యులు కొనుగోలు చేసే విధంగా తక్కువ ధరలకు విక్రయిస్తున్నాం. ప్రతీరోజు 10 కూలర్ల వరకు అమ్ముతున్నాం.

– సహారే రవి కుమార్, వ్యాపారి

మరమ్మతులు చేస్తున్నాం



ఎండలు పెరిగిన దృష్ట్యా భారీగా కూలర్లను రిపేర్ చేయించుకుంటున్నారు. తీరిక లేకుండా వ్యాపారం కొనసాగుతోంది. ప్రతీరోజు 15 నుంచి 20 కూలర్లకు మరమ్మతులు చేస్తున్నాం. ఈ వ్యాపారం మే నెలాఖరు వరకు కొనసాగుతుంది.

– షేక్ సద్దాం, కూలర్ మెకానిక్

సాగు.. లాభాలు బాగు..!

- స్వల్పకాలిక పంటలతో లాభాలు
- కూరగాయల సాగుపై మక్కువ
- సంతలు, గ్రామాల్లో విక్రయాలు
- ఆదర్శంగా నిలుస్తున్న లోడుపల్లి రైతులు


లోడుపల్లిలో సాగవుతున్న వంకాయ పంట

పెంచికల్‌పేట్: స్వల్పకాలిక పంటలతో పాటు అధిక ఆదాయాన్ని ఇచ్చే ఆకుకూరలు, కూరగాయలు, దుంపలను సాగు చేస్తూ సన్న, చిన్నకారు రైతులు అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. మండలంలోని లోడుపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు తమకున్న సుమారు 10 నుంచి 20 గుంటల భూముల్లో కాలాలకు అతీతంగా అనేక పంటలు సాగు చేస్తూ విక్రయాలు జరుపుతున్నారు.

అనేక రకాల పంటల సాగు..

లోడుపల్లి గ్రామంలో సుమారు 100 మాలీ కుటుంబాలు ఉన్నాయి. వీరంతా వ్యవసాయమే జీవనాధారంగా జీవనం సాగిస్తున్నారు. వీరు గ్రామంలో బోరుబావులు, బావుల ద్వారా పంటలు సాగు చేస్తున్నారు. ఒకవైపు వాణిజ్య పంటలైన పత్తి, వరితో పాటు చిన్నపాటి సాగు భూమిలో మిర్చి, ఆకుకూరలు, ఉల్లిగడ్డలు, వంకాయలు, టమాటలు, బెండకాయ, చిక్కుడు, బీరకాయ, అల్లంత, కందగడ్డలను సాగు చేస్తున్నారు. కాలానికి అనుగుణంగా స్వల్పకాలిక పంటలను సాగు చేస్తున్నారు. పండించిన పంటలను మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉదయాన్నే విక్రయిస్తున్నారు. మరోవైపు పెంచికల్‌పేట్, చేడ్వాయి, సలుగుపల్లి, బెజ్జూర్, రవీంద్రనగర్ సంతలతో పాటు కాగజ్‌నగర్ పట్టణానికి పంటలను తరలించి విక్రయాలు జరుపుతున్నారు. భూమిలో ఒక పంట పూర్తయ్యాక మరో పంటను జూన్ వరకు సాగు చేస్తూ వారానికి సుమారు రూ.10వేల వరకు ఆదాయాన్ని పొందుతున్నారు.

స్వల్పకాలిక పంటలు సాగు చేస్తాం



సంప్రదాయ పంటలతో పాటు మాకు ఉన్న ఎకరం భూమిలో కూరగాయలను సాగు చేస్తున్నాం. రెండు నుంచి మూడు నెలల్లో చేతి కొచ్చే పంటలను ఎక్కువగా పండిస్తున్నాం. తక్కువ భూమిలో రకరకాల పంటలను సాగు చేస్తుండటంతో లాభాలు గడించవచ్చు. పంటలకు చీడపీడలు సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటూ సాగులో మంచి ఫలితాలు సాధిస్తున్నాం.

– గుర్లె బాపురావు, రైతు, లోడుపల్లి

ప్రభుత్వం ప్రోత్సహించాలి



వ్యవసాయ భూముల్లో బావులు, బోర్ల ద్వారా మాత్రమే సాగు చేస్తున్నాం. పంటల సాగులో సరైన మెలుకువలు అందడం లేదు. దీంతో సంప్రదాయ పద్ధతిలో పంటలను సాగు చేస్తున్నాం. దీంతో పంట దిగుబడిలో కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు ఉద్యానవన పంటలను సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహం అందించాలి.– మొర్ల మధుకర్, రైతు, కొండపల్లి

ప్రజలకు భరోసా కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్


జైనూర్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ సదయ్య

జైనూర్: ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు భూసిమెట్ట గ్రామంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లోనవకుండా ప్రతీ ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు, ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ అంజయ్య, ఎస్సై సందీప్‌కుమార్, కేంద్ర బలగాల బృందం, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి


మాట్లాడుతున్న సీఐ అల్లం రాంబాబు

పెంచికల్‌పేట్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో ఆదివారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తుపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో నాటు సారా తయారీ చేసినా, విక్రయించినా సమాచారం అందించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతీ ఒక్కరు పాటించాలని, కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకు ముందు సిబ్బందితో కలిసి ప్రతీ ఇంటిలో సోదాలు నిర్వహించారు. ఆయన వెంట ఎస్సై కొమురయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం


ఉద్యోగ విరమణ పొందిన డీఎస్‌వో తారామణి దంపతులను సన్మానిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్: జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన తారామణి దంపతులను ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువలు, పూలదండలతో సన్మానించారు. అధికారులు మాట్లాడుతూ డీఎస్‌వో తారామణి సేవలను కొనియాడారు. డీటీలు రాజ్‌కుమార్, శ్యాంలాల్, శ్రీనివాస్, సిబ్బంది బుల్లెట్, తిరుపతి, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు ఆత్మారాం, రాపర్తి శ్రీనివాస్, తణుకు మురళి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలి


సీతక్కను సన్మానిస్తున్న నాయకులు


సుగుణను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రెబ్బెన: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కోరారు. మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ వద్ద మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇన్‌చార్జి మంత్రితో పాటు ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఘన స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే సగానికి పైగా అమలు చేస్తున్నామన్నారు. త్వరలోనే రైతుభరోసా, రైతు రుణమాఫీ గ్యారంటీలను సైతం అమలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందని పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో ఒకసారి బీఆర్ఎస్, మరోసారి బీజేపీ అభ్యర్థులను ఇక్కడి ప్రజలు గెలిపిస్తే జిల్లాకు చేసింది శూన్యమని ఆరోపించారు. ఇన్‌చార్జి మంత్రితో పాటు పార్లమెంట్ అభ్యర్థిని మండల నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నియోజక వర్గ ఇన్‌చార్జి ఆజ్మీర శ్యాం నాయక్, మండల అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి దేవాజీ, సుదర్శన్‌గౌడ్, గోగర్ల రాజేశ్, చిరంజీవిగౌడ్, ఎంపీటీసీ రఘుపతి, నాయకులు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు


మరమ్మతు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కెరమెరి: మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని శంకర్‌లొద్ది గ్రామంలో గడిచిన ఐదు రోజులుగా మిషన్ భగీరథ పైపు లీకేజీ కావడం వల్ల నీరు వృథాగా పోతుందని ఆదివారం 'సాక్షి' దినపత్రికలో 'వృథాగా భగీరథ నీరు' అనే కథనం ప్రచురితం కావడంతో గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి గ్రామీణులకు నీటిని సరఫరా చేశారు. ఎంపీవో అంజద్‌పాషా ఆదేశాల మేరకు ఆదివారం పగిలి ఉన్న మిషన్ భగీరథ పైపును సరిచేసి ప్రజలకు నీరు అందించినట్లు గ్రామ కార్యదర్శి ఇంగ్లె రమేశ్ తెలిపారు.

ఆలయంలో పూజలు

ఆసిఫాబాద్: మండలంలోని తుంపెల్లి సమీపంలో గల చల్లమల్లన్న ఆలయంలో ఆదివారం జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, ఎంపీపీ మల్లికార్జున్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో మల్లికార్జునస్వామి, నందీశ్వర, శివలింగం ప్రతిష్ఠాపన అనంతరం 16వ రోజులో భాగంగా పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణ, ప్రసాద్ గౌడ్, వెంకన్న, అశోక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'మునిగంటివార్‌ను గెలిపించాలి'

ఆసిఫాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో చంద్రపూర్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుధీర్ మునిగంటి వార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సతీశ్‌బాబు, జిల్లా అధికార ప్రతినిధి అంజనేయులు గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సుచిత్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్, నాయకులు ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు


సదాశివపేట చర్చిలో ఈస్టర్ వేడుకల్లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కౌటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో గల చర్చిల్లో మండలంలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. ఈస్టర్ వేడుకల కోసం మండల కేంద్రంతో పాటు మండలంలోని విజయనగరం, యాపలగూడ, శివలింగపూర్, సదాశివపేట గ్రామాలలో గల చర్చిల్లో ఈస్టర్ పండుగ సందర్భంగా క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విజయనగరం చర్చిలో ఫాదర్ సీజో, యాపలగూడ చర్చిలో ఫాదర్ సతీశ్, కౌటాల చర్చిలో ఫాదర్ టామో, సదాశివపేట చర్చిలో పాస్టర్ శ్రీనివాస్, శివలింగపూర్ చర్చిలో సువార్త రాజన్నలు క్రైస్తవులకు ఈస్టర్ సందేశాన్ని అందించారు.

యేసు క్రీస్తు చూపిన మార్గంలో నడవాలి..

మండలంలోని విజయనగరంలోని కతోలిక చర్చిలో ఈస్టర్ వేడుకలను పురస్కరించుకొని ఫాదర్ సీజో క్రైస్తవులకు సందేశం బోధించారు. యేసుక్రీస్తు చూపిన మార్గంలో క్రైస్తవులు నడపాలని పేర్కొన్నారు. యేసుక్రీస్తు మరణాన్ని జయించి, మరణపు ముల్లును విరిచి, మరణపు మెడలు వంచి తిరిగి లేచాడన్నారు. యేసు ప్రభువు ప్రజలను రక్షించడానికి ఈ లోకానికి వచ్చి ప్రజల పాపాల కోసం మరణించాడని తెలిపారు. అనంతరం భక్తులకు ప్రేమ విందు (అన్నదానం) నిర్వహించారు. యేసు పునరుత్థాన (ఈస్టర్) పండుగ వేడుకల్లో మండలంలోని క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇసుక మాఫియాను అరికట్టాలి

రెబ్బెన: మండలంలోని నేర్పల్లి శివారులో కొనసాగుతున్న అక్రమ ఇసుక మాఫియాను అరికట్టాలని డీవైఎఫ్ఐ చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాగుల నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలించిన ఇసుకను నేర్పల్లి శివారులోని చాపిడి దేవాజీకి చెందిన వ్యవసాయ భూమిలో డంప్ చేస్తూ రాత్రివేళల్లో యథేచ్ఛగా లారీల ద్వారా ఇతర జిల్లాలకు అక్రమంగా తరలిస్తున్నారని పేర్కొన్నారు. దేవాజీ వ్యవసాయ భూమికి పక్కనే ఉన్న చాపిడి భీంరావ్‌కు చెందిన వ్యవసాయ భూమిలో పదేళ్లుగా పెంచుతున్న టేకు చెట్లను సైతం ఇసుక మాఫియాదార్లు నరికి వేసి తీసుకెళ్లారని ఆరోపించారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు ఇసుక అక్రమ రవాణా చేసే వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే భీంరావుకు చెందిన టేకు చెట్లకు రూ.50వేల నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

చెట్టు పడితే.. ప్రమాదమే!



కౌటాల: మండల కేంద్రంలోని పాత ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కౌటాలలోని మార్కెట్ ఏరియాలో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించడంతో పాత ఆసుపత్రి భవనాల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. దీంతో పాత ఆసుపత్రి ఆవరణలోని ఆరోగ్య కేంద్రం శిథిల భవనంపై చెట్టు పెరిగింది. దీంతో భవనం గోడలు కూలిపోయాయి. గాలి దుమారం వీస్తే గోడపై ఉన్న చెట్టు నేలకొరిగే ప్రమాదం ఉంది. ఆవరణలోకి ప్రజలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో చెట్టు పడితే పెద్ద ఎత్తున ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి శిథిల భవనాన్ని తొలగించి ప్రమాదం జరగక ముందే చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

జోరుగా మున్సిపల్ పన్నుల వసూళ్లు


పన్నులు వసూలు చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్: ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ సిబ్బంది పట్టణంలో గడప గడపకూ తిరుగుతూ ఇంటి, నీటి పన్నులు వసూలు చేశారు. పన్నుల వసూలుకు మార్చి 31 చివరి తేదీ కావడంతో ప్రజలు పన్నులు కట్టేందుకు ఆసక్తి చూపారు. పట్టణంలోని శివకేశవ మందిర్ వీధి, గాంధీ చౌక్, వివేకానంద చౌక్, రావులవాడ, బాపూనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పన్నులు వసూలు చేశారు. ఆదివారం రాత్రి వరకు సుమారు రూ.2 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది.